

పిల్లలను ఫోన్‌కు దూరంగా..

సెల్ ఫోన్ ప్రభావం పిల్లలపై అధికంగా ఉందని సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్ రావు అన్నారు. ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు.

- 8లో ▸



సమాచార హక్కు వ్యవస్థను..

సమాచార హక్కు వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /18.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఏర్పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 75 వేల 394 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 21 వరద గేట్ల ద్వారా 65,604 క్యూసెక్కుల నీటిని అధికారులు గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4 వేలు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1090.90(80.05 టీఎంసీలు) అడుగులు నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

వరద కాలువ గండిని పరిశీలించిన ఇంజినీర్లు



మోర్తాడ్(బాల్కొండ): వరద కాలువకు గండిపడిన చోట మరమ్మతులు పూర్తి చేయడానికి యుద్ధ ప్రాతిపదికన అంచనాలను తయారు చేయాలని ఆపరేషన్స్, మెయింటినెన్స్ ఇంజినీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మోర్తాడ్ మండలం గాండ్లపేట్ శివారులోని వరద కాలువ అక్విడెక్ట్‌ను పరిశీలించారు. గండిపడిన చోట పనులు వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మూడు రోజుల్లో అంచనాలను రూపొందించి పంపించాలని సూచించారు. ఆయన వెంట సెంట్రల్ డిజైన్ చీఫ్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి, ఎస్సారెస్పీ సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ జగదీశ్వర్, ఈఈ చక్రపాణి, డీఈ గణేశ్, ఏఈఈలు పాల్గొన్నారు.

డీసీసీ, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు దరఖాస్తులు



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవితోపాటు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవులను త్వరలో భర్తీచేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్నికలను పరిశీలించేందుకు ఏఐసీసీ, కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్‌ను నియమించింది. ఆయన పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రకియ కొనసాగనుంది. పదవుల కోసం పోటీచేసే ఆశావహులు ఈ నెల 12 లోపు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో దరఖాస్తులు అందజేయాలని మోహన్‌రెడ్డి సూచించారు.



పరిశోధన స్థానంలో సాగవుతున్న ఆర్మూర్ పసుపు రకం పంట

ఇక ఆర్మూర్ పసుపు

- భౌగోళిక గుర్తింపునకు కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం కృషి
- సెప్టెంబర్‌లో దరఖాస్తు, రిజిస్ట్రీ ఆమోదం
- జీఐ ట్యాగ్‌తో పంటకు మంచి ధర, మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలు మెరుగు

కమ్మర్‌పల్లి: ఆర్మూర్ ప్రాంతంలో సాగయ్యే పసుపు పంటకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం కోసం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పసుపు పరిశోధన కేంద్రం సంకల్పించింది. తరతరాలుగా ఈ ప్రాంత రైతులు పండిస్తున్న సంప్రదాయ వెరైటీ ఎర్ర గుంటూర్ రకం పసుపు పంటకు భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) తీసుకురావడం కోసం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, వనపర్తి జిల్లా మోజర్ల ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త సైదయ్య ఆధ్వర్యంలో పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి మహేందర్, శ్రీనివాస్, నాబార్డ్, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులు రైతు సహకార సంఘాలతో కలిసి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందం సభ్యులు ఆర్మూర్, నిర్మల్, మెట్‌పల్లి, జగిత్యాల, మహబూబాబాద్ ప్రాంతాల్లో పర్యటించి పసుపు పంటల సాగు విస్తీర్ణాన్ని పరిశీలించి జీఐ ట్యాగ్‌కు అవసరమైన ఆధారాలు సేకరించారు. ఈ పసుపు రకానికి ప్రత్యేకమైన సువాసన, రంగు, ఔషధ గుణాలు ఉన్నట్లు గుర్తించారు. భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) కోసం గత నెలలో చెన్నైలోని మేధో సంపత్తి హక్కుల కార్యాలయం (జీఐ ట్యాగ్ రిజిస్ట్రేషన్)లో దరఖాస్తు చేయగా రిజిస్ట్రీ ఆమోదం తెలిపింది.



క్షేత్రస్థాయిలో పసుపు పంటను పరిశీలిస్తున్న పరిశోధన బృందం సభ్యులు

బ్రాండ్ నేమ్‌తో మంచి ధర

ఆర్మూర్ ప్రాంతంలో సాగయ్యే ఎర్ర గుంటూర్ రకం పసుపు పంటకు శాస్త్రవేత్తల బృందం ఆర్మూర్ పసుపుగా నామకరణం చేసి జీఐ ట్యాగింగ్ (భౌగోళిక గుర్తింపు)కు దరఖాస్తు చేశారు. బ్రాండ్‌కు చట్టపరమైన రక్షణ కల్పించడమే భౌగోళిక గుర్తింపు. దీన్ని దృష్టిలో ఉంచుకొని చేసేదే 'ది జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్(రిజిస్ట్రేషన్ అండ్ ప్రొటెక్షన్) యాక్ట్ 1999' ఈ భౌగోళిక గుర్తింపు వల్ల ఈ ప్రాంతంలోని ఉత్పత్తికి అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. దీనివల్ల పంటకు డిమాండ్ ఏర్పడి అధిక ధర లభిస్తుంది. ఆర్మూర్ పసుపునకు జీఐ ట్యాగ్ ఇచ్చే ప్రక్రియను ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ రకం పసుపు అధిక దిగుబడి రావడంతో పాటు, నాణ్యత, శక్తివంతమైన రంగు, అధిక కుర్కుమిన్ శాతం కోసం ప్రసిద్ధి చెందింది. భౌగోళిక గుర్తింపుతో అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడుతుంది. రైతులకు మంచి ధర, మెరుగైన మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలను మెరుగుపడతాయి. వినియోగదారులకు నాణ్యతపై నమ్మకం పెరుగుతుంది. రైతుల ఉత్పత్తిదారుల హక్కులను కాపాడుతుంది. స్థానిక సంస్కృతి పరిరక్షణకు సహాయపడుతుంది. బ్రాండ్ నేమ్‌తోనే పసుపు ఉత్పత్తి చేయడం, విక్రయించడానికి అనుమతి ఉంటుంది. దీనివల్ల మంచి ధరతో పాటు, వ్యాపార అవకాశాలను సృష్టిస్తుంది. రైతుల ఆదాయం పెరుగుతుంది.

జీఐ ట్యాగింగ్‌తో డిమాండ్



ఆర్మూర్ పసుపునకు జీఐ ట్యాగింగ్‌తో ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడుతుంది. పరిశోధన బృందం సభ్యులందరం కలిసి క్షేత్ర స్థాయిలో పసుపు పంటను పరిశీలించి ఆధారాలు సేకరించాం. సెప్టెంబర్‌లో జీఐ ట్యాగింగ్‌కు దరఖాస్తు చేశాం. రిజిస్ట్రీ ఆమోదం తెలిపింది. మూడు నెలల్లో ఆర్మూర్ పసుపునకు జీఐ ట్యాగింగ్ లభిస్తుంది. ఆర్మూర్ ప్రాంత రైతులకే హక్కులు ఉంటాయి.

– డాక్టర్ బి. మహేందర్, ప్రధాన శాస్త్రవేత్త, పసుపు పరిశోధన స్థానం, కమ్మర్‌పల్లి

ఇతర రాష్ట్రాల్లో జీఐ ట్యాగ్ పొందిన పసుపు రకాలు..

- తమిళనాడులో ప్రత్యేక లక్షణాలతో ఈరోడ్ మంజల్ పసుపు
- మహారాష్ట్రలో ఆసియాలోనే పసుపునకు అతిపెద్ద వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన సంగాలి రకం పసుపు, అదేవిధంగా అధిక కుర్కుమిన్ శాతం, సువాసనకు ప్రసిద్ధి చెందిన వైగావ్ రకం పసుపు.
- ఒడిశాలో ఘాటైన వాసన, ఔషధ గుణాలు కలిగిన కంధమాల్ హల్దీ రకం పసుపు
- మేఘాలయలో అత్యధిక కుర్కుమిన్ శాతం కలిగిన లకడోంగ్ రకం పసుపు.

ఎమ్మెల్యే భూపతి రెడ్డికి సీఎం పరామర్శ

- 'ద్వాదశ దినకర్మ'కు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

సుభాష్‌నగర్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పరామర్శించారు. నగరశివారులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీనర్సమ్మ ద్వాదశ దిన కర్మ కార్యక్రమానికి హాజరై చిత్ర పటానికి నివాళులు అర్పించారు. భూపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్ బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జులు వినయ్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నగేష్‌రెడ్డి, ఈగ గంగారెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మునిపల్లి సాయిరెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన కలెక్టర్, సీపీ

సీఎం రేవంత్‌రెడ్డికి కలెక్టరేట్‌లో హెలీప్యాడ్ వద్ద కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జిల్లా అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాతృమూర్తి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తదితరులు

విద్యార్థులను సమయానికి చేర్చండి

- ఆర్టీసీ అధికారులకు సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

రెంజల్(బోధన్): విద్యార్థులను సమయానికి బడికి చేర్చాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావు ఆర్టీసీ అధికారులకు సూచించారు. శుక్రవారం నిజామాబాద్ డిపో రీజనల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ ఆర్ఎం మధుసుదన్‌లను జిల్లా కోర్టులోని తన కార్యాలయం న్యాయ సేవా సదన్‌కు పిలిపించుకుని మాట్లాడారు. బస్సులు సమయానికి రాకపోవడంతో రెంజల్ మండలం కందకుర్తిలో విద్యార్థినులు బస్సు ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. 'బస్సును అడ్డుకున్న పాఠశాల విద్యార్థులు' అనే శీర్షికతో గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందించిన ఆయన ఆర్టీసీ అధికారులతో చర్చించారు. విద్యార్థులకు ఎలాంటి అవరోధాలు రానీయవద్దని, విద్యను అభ్యసించే వారికి ఇబ్బందులు కలుగకుండా పాఠశాలకు సమయానికి చేరుకునేలా బస్సులను నడపాలని వారికి సూచించారు. పాఠశాల సమయాలను తెలుసుకుని బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమయానికి బడులకు వెళ్లకుంటే చదువుపై ప్రభావం పడుతుందని జడ్జి పేర్కొన్నారు. బస్సులను పాఠశాలల సమయానికి అనుగుణంగా నడుపుతామని ఆర్టీసీ అధికారులు అంగీకరించారు.



ఆర్ఎంతో మాట్లాడుతున్న న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా కార్యదర్శి

నిరసన బాటలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు

- పేరుకుపోయిన రూ. 10 కోట్ల బకాయిలు
- వెంటనే విడుదల చేయాలని డిమాండ్

మోర్తాడ్(బాల్కొండ): మధ్యాహ్న భోజన ఏజెన్సీలు నిరసన గళం వినిపిస్తున్నాయి. బిల్లు బకాయిలు జిల్లాలో రూ.10 కోట్ల వరకు పేరుకు పోవడంతో ఏజెన్సీల కార్మికులు సోమవారం నుంచి విడతల వారీగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే నిరవధిక సమ్మె చేపడతామని కార్మికులు హెచ్చరిస్తున్నారు. 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు భోజనం పెట్టిన బిల్లులు ఏడాది కాలంగా చెల్లించడం లేదు. కోడిగుడ్లకు సంబంధించిన బిల్లులు, గౌరవ వేతనం బకాయిలు అలాగే ఉన్నాయి. జిల్లాలో 1124 ఏజెన్సీలు అన్ని పాఠశాలల్లో వంట చేసి పెడుతున్నాయి. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా బిల్లులు చెల్లించకుండా తమను క్షోభ పెడుతోందని ఏజెన్సీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 13 నుంచి మధ్యాహ్నం పూట నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలియజేయనున్నారు. వారం రోజుల పాటు వివిధ రకాల నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని ఏజెన్సీల కార్మికుల అసోసియేషన్ నిర్ణయించింది. ప్రభుత్వం స్పందించకపోతే వంట బంద్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి...

ప్రభుత్వం స్పందించి ఏజెన్సీలకు బకాయిలను వెంటనే చెల్లించాలి. జిల్లాలో రూ.10 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులతో ఏజెన్సీలను నిర్వహించడం కష్టం అవుతుంది.

– చక్రపాణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆర్వోబీల పనులు పూర్తిచేయాలి

- వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- 'అర్బన్' అభివృద్ధికి సహకరించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యేల వినతి
- ముఖ్యమంత్రి పర్యటనలో బీజేపీ నిరసన సెగలు



సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్ రెడ్డి తదితరులు

సుభాష్‌నగర్: జిల్లాలోని అర్సపల్లి, అడవి మామిడిపల్లి, మాధవనగర్ అండర్ రైల్వే బ్రిడ్జి(ఆర్వోబీ)ల నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు శుక్రవారం నిరసన తెలియజేశారు. మొదట ఆర్వోబీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ అధ్యక్షుడు దినేశ్ పటేల్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం పర్యటనను ఎక్కడ అడ్డుకుంటారోనని పోలీసులు బీజేపీ నాయకులను అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. బీజేపీ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులు భారీగా మోహరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసేందుకు కలెక్టరేట్‌కు వెళ్లిన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు కేవలం వినతి పత్రం ఇవ్వాలని పోలీసులు చెప్పడంతో వారు అక్కడే అందోళనకు దిగారు. ఎమ్మెల్యేలు సహా నాయకులు కలెక్టరేట్‌లో కింద కూర్చొని నిరసన తెలియజేశారు. అనంతరం పోలీసుల అనుమతితో ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం కింద నియోజకవర్గానికి 3500 మంజూరైతే.. స్థలం కొరత వల్ల కేవలం 1757 మాత్రమే కేటాయించారని అన్నారు. మిగతా 1743 ఇండ్లు చంద్రశేఖర్‌నగర్ కాలనీలో ప్రభుత్వమే భూమిని కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. నాగారంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల మరమ్మతులకు కేటాయించిన రూ.1.25 కోట్లకు అదనంగా సరిపడా నిధులు మంజూరు చేయాలన్నారు. జీజీహెచ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి అనువుగా జీవోలో మార్పులు చేయాలని కోరారు. సీడీపీ నిధులు విడుదల చేయాలని, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 కోట్లు కేటాయించాలన్నారు. మున్సిపాలిటీలో రోడ్లు, పార్కులకు, జంక్షన్ల అభివృద్ధి కోసం రూ.100 కోట్ల ప్రణాళిక సిద్ధం చేశామని, వాటికి అవసరమయ్యే నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.



బీజేపీ కార్యాలయం వద్ద పోలీసులు, నాయకుల మధ్య తోపులాట

అభివృద్ధిలో స్తబ్ధత

జిల్లాలో భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ డిమాండ్ చేశారు. పీఎం నిధులతో ఆమోదం పొందిన పనులు ఆలస్యమవుతున్నాయని, అభివృద్ధిలో స్తబ్ధత నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్వోబీలను తక్షణమే పూర్తి చేయాలని, పనులు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, శంకర్‌రెడ్డి, పద్మారెడ్డి, తారక్ వేణు, నాగరాజు, పిల్లి శ్రీకాంత్, దొంతుల రవి, ఆమంద్ విజయ్, పంచరెడ్డి శ్రీధర్, సాయివర్ధన్, ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో కింద కూర్చొని నిరసన తెలుపుతున్న బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు

నకిలీ అధ్యాపకులు!

- క్రమబద్ధీకరణ కోసం తప్పుడు ధ్రువపత్రాల సమర్పణ
- జిల్లాలో 30 మంది గుర్తింపు
- ఒక్కొక్కరి వద్ద రూ. ఐదు లక్షలు వసూలు
- తుది దశకు వచ్చిన అధికారుల విచారణ
- చర్యలకు అవకాశం

నిజామాబాద్‌అర్బన్: ఉద్యోగం క్రమబద్ధీకరణ (రెగ్యులరైజ్) కోసం కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు నకిలీ సర్టిఫికెట్లను సమర్పించారు. ఈ వ్యవహారం పై ప్రస్తుతం జరుగుతున్న విచారణ తుది దశకు వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న అధ్యాపకులను క్రమబద్ధీకరించారు. అయితే కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు నకిలీ ధ్రువపత్రాలను సమర్పించి క్రమబద్ధీకరణ పొందారు. దీనిపై ఫిర్యాదు వెళ్లగా కొన్నేళ్లుగా రాష్ట్రస్థాయిలోనే విచారణ చేపట్టారు. ఇటీవల జిల్లాల వారీగా విచారణ చేపట్టడంతో జిల్లాలో 30 మంది జూనియర్ అధ్యాపకులు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు విచారణలో తేలింది.

యూనివర్సిటీలు లేకున్నా..

జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 130 మంది కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టి కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల కోడ్ సమీపిస్తుందన్న సమయంలోనే ఈ కార్యక్రమం నిర్వహించారు. కాంట్రాక్టు అధ్యాపకులు కొందరు అర్హులు కాకున్నా నకిలీ ధ్రువపత్రాలను తీసుకువచ్చి ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించుకున్నారు. గత నెల 10న జిల్లా ఇంటర్ విద్యాధికారి క్రమబద్ధీకరించబడిన 130 మంది కాంట్రాక్టు అధ్యాపకుల ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని వరంగల్ ఆర్జేడి కార్యాలయంలో పరిశీలన చేశారు. ఇందులో 30 మంది అధ్యాపకులు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్లు గుర్తించారు. ఇందులో పాండిచ్చేరి అలగప్ప, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన దూరవిద్య కేంద్రాలకు సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించారు. ఈ ధ్రువ పత్రాలకు సంబంధించి ఎలాంటి యూనివర్సిటీ కొనసాగడం లేదు. నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన అధ్యాపకుల సంబంధించిన రహస్య విచారణ ప్రస్తుతం ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 700 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లాల వారీగా నకిలీ అధ్యాపకులను గుర్తించి తుది నివేదికను రూపొందించనున్నారు. అనంతరం వీరిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అధికారులు భావిస్తున్నారు.

అందరూ పంచుకున్నారు..

కాంట్రాక్టు అధ్యాపకులు క్రమబద్ధీకరణ కోసం భారీగా డబ్బులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు ప్రజాప్రతినిధులను కలిసి డబ్బులు సమర్పించినట్లు సమాచారం. ఒక్కో అధ్యాపకుడు రూ. ఐదు లక్షల చొప్పున సమర్పించినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అధ్యాపకుల సంఘానికి చెందిన ఇద్దరు నాయకులు కళాశాలల వారీగా కాంట్రాక్టు అధ్యాపకులందరి వద్ద డబ్బులు వసూలు చేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర సంఘం నాయకులు, జిల్లా సంఘం నాయకులు, జిల్లాకు చెందిన అధికారులు వసూలు చేసిన డబ్బులు పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఉన్నతాధికారుల దృష్టికి..

గత నెల వరంగల్ ఆర్జేడీ కార్యాలయంలో క్రమబద్ధీకరించబడిన కాంట్రాక్టు అధ్యాపకుల ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. ఇందులో కొన్ని లోపాలు ఉన్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు పరిశీలన చేపడుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన పత్రాలను గుర్తించారు. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియడం లేదు.

– రవికుమార్, ఇంటర్ విద్యాధికారి

క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన దయాకర్‌గౌడ్‌



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ఉమ్మడి జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టుల స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ దయాకర్‌ గౌడ్‌ శుక్రవారం నిజామాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తన నియామకం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బాధితులకు న్యాయం చేస్తానని సీఎంకు వివరించారు.

కాంట్రాక్టు అధ్యాపకుడికి డాక్టరేట్‌



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అప్లయిడ్‌ స్టాటిస్టిక్స్‌ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుడు బి సందీప్‌ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ సాధించారు. 'స్టాటిస్టికల్‌ మోడలింగ్‌ ఆఫ్‌ మ్యూచువల్‌ ఫండ్స్‌ డాటా' అనే అంశంపై ఆయన డాక్టరేట్‌ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం తెయూ వీసీ ప్రొఫెసర్‌ యాదగిరి రావు, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి, అప్లయిడ్‌ స్టాటిస్టిక్స్‌ విభాగాధిపతి, కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ సంపత్‌కుమార్‌తోపాటు పలువురు అధ్యాపకులు సందీప్‌ను అభినందించారు.

పిల్లలను ఫోన్‌కు దూరంగా ఉంచాలి

- సీనియర్‌ సివిల్‌ జడ్జి ఉదయ భాస్కర్‌ రావు



నిజామాబాద్‌ లీగల్‌: సమాజంలో సెల్‌ఫోన్‌ అందరికీ సమస్యగా మారిందని, అది మన మెదడుపై ప్రభావం చూపుతోందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి ఉదయ భాస్కర్‌రావు అన్నారు. సెల్‌ ఫోన్‌ ప్రభావం ప్రధానంగా చిన్న పిల్లలపై అధికంగా ఉందని, తల్లిదండ్రులు పిల్లలను ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవా సంస్థ కార్యాలయంలో, స్నేహ సొసైటీ ఫర్‌ రూరల్‌ రీకన్‌స్ట్రక్షన్‌ నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫోన్‌ కారణంగా పిల్లలలో తలెత్తుతున్న సమస్యలను తల్లిదండ్రులు ప్రారంభదశలోనే గుర్తించి చికిత్స చేయించాలన్నారు. మానసిక వైద్యుడు విశాల్‌ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం సమాజంలో అందరికీ అవసరమని, మానసిక వికలాంగులకు విద్యా, వైద్య సౌకర్యాలు అందించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు రవితేజ, డిచ్‌పల్లి సీడీపీవో జ్యోతి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, అంధుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్‌ ఎస్‌.జ్యోతి, మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్‌ రాజేశ్వరి, సఖి సెంటర్‌ అడ్మినిస్ట్రేటర్‌ భానుప్రియ, స్నేహ సొసైటీ టీప్రాజెక్ట్‌ మేనేజర్‌ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్‌ అంకిత్‌, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌ రెడ్డి

సీఎం రేవంత్‌ రెడ్డికి అధికారులు, నేతల స్వాగతం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నగరంలో పర్యటించారు. రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్‌ వద్ద జిల్లాకు చెందిన అధికారులు, కాంగ్రెస్‌ నేతలు, నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీఎం, చిత్రంలో పీసీసీ చీఫ్‌ మహేశ్‌ గౌడ్‌, సలహాదారు షబ్బీర్‌ అలీ

సీఎం పర్యటనలో కట్టుదిట్టమైన బందోబస్తు

పర్యవేక్షించిన ఐజీపీ చంద్రశేఖర్‌ రెడ్డి, సీపీ సాయిచైతన్య



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ



ఐజీపీ చంద్రశేఖర్‌ రెడ్డితో సీపీ

ఖలీల్‌వాడి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు శుక్రవారం నగరంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా సీపీ సాయిచైతన్య ఉదయం నగరంలోని శ్రావ్య గార్డెన్‌లో పోలీస్‌ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. డ్యూటీ స్థలం విడిచి ఎక్కడికి వెళ్లొద్దని, సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశించారు.

సీఎం పర్యటన బందోబస్తులో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బంది, హోంగార్డులతో కలిపి మొత్తం 600 మంది పాల్గొన్నారు. నగరంలోని మాధవనగర్‌ బైపాస్‌, కంఠేశ్వర్‌ బైపాస్‌, అర్సపల్లి, ఆర్‌ఆర్‌ ఎక్స్‌ రోడ్డు, పులాంగ్‌, రుక్మిణి చాంబర్‌, బోర్గాం(పి) బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ ఆంక్షలు విధించారు. సీఎం కాన్వాయ్‌ వెళ్లే సమయంలో అన్ని వైపులా వాహనాలను నిలిపివేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో నగరంలో ఏర్పాటు చేసిన బందోబస్తును ఐజీపీ ఎస్‌.చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. సీపీ సాయిచైతన్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీకృత కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సీపీ సాయిచైతన్య పుష్పగుచ్ఛం అందజేశారు. బందోబస్తులో అదనపు డీసీపీ (అడ్మిన్‌) బస్వారెడ్డి, ఏసీపీలు రాజా వెంకటరెడ్డి, వెంకట్‌ రెడ్డి, శ్రీనివాస్‌, నాగేంద్ర చారి, రాజశేఖర్‌, మస్తాన్‌ అలీ తదితరులు పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన పొలాస విద్యార్థులు



పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌ గ్రామాన్ని జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా అంకాపూర్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విత్తన అభివృద్ధి కేంద్రాలను సందర్శించారు. దీంతోపాటు రైతులు సాగు చేస్తున్న అంతర పంటలు, నీటి యాజమాన్య పద్ధతులపై అంకాపూర్‌ సొసైటీ సభ్యుడు కేకే భాజన్నను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పొలాస వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు రమేశ్‌, జయంత్‌, శ్రావణ్‌, శ్రీకాంత్‌, రంజిత్‌, కే నర్సారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్‌వో రాజశ్రీ



బోధన్‌టౌన్‌(బోధన్‌): ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే సహించేది లేదని, ఆర్‌ఎంపీ, పీఎంపీలు రిఫర్‌ చేసిన రోగులకు స్కానింగ్‌ తీయొద్దని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని శక్కర్‌నగర్‌ కాలనీలో ఉన్న బస్తీ దవాఖానాలో బోధన్‌ డివిజన్‌ స్థాయిలోని ప్రైవేట్‌ ఆస్పత్రుల వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యుల వివరాలు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అందించాలన్నారు. డాక్టర్‌ మారినా, ఒకే డాక్టర్‌ ఒకటి లేదా రెండు ఆస్పత్రుల్లో పనిచేస్తే ఆ వివరాలు సూచిక బోర్డులో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆస్పత్రుల్లో బయో మెడికల్‌ వేస్టేజ్‌ నిర్వహణ, పొల్యూషన్‌, పార్కింగ్‌, లీజ్‌, రెంట్‌ అగ్రిమెంట్‌ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆస్పత్రిలో ధరల సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని, చికిత్స కోసం వచ్చే రోగులకు ఆస్పత్రిలో ప్రాథమిక వసతులు తప్పనిసరి కల్పించాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్‌ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఐఈవో రవికుమార్‌

నిజామాబాద్‌అర్బన్‌: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాలలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను డీఐఈవో రవికుమార్‌ శుక్రవారం పరిశీలించారు. ప్రిన్సిపల్‌ బుద్ధిరాజు ఆధ్వర్యంలో కళాశాలలో చేపడుతున్న సివిల్‌ పనుల నిర్వహణపై సంతృప్తిని వ్యక్తంచేశారు. తరగతి గదులలో చిన్న చిన్న మరమ్మతులు, విద్యుత్‌ మరమ్మతు పనులు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. అనంతరం సీఎస్‌ఐ జూనియర్‌ కళాశాల, ఆల్ఫోర్స్‌ జూనియర్‌ కళాశాలలను డీఐఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రిన్సిపాళ్లు, బోధనేతర సిబ్బందితో సమావేశమై విద్యార్థుల అపార్‌, యుడైస్‌ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

జీఎస్టీ తగ్గించట్లేదా.. ఫిర్యాదు చేయండి

మీ కోసం..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): కేంద్రం వస్తు సేవల పన్నులో కొన్ని స్లాబ్‌లను ఎత్తివేసింది. కొన్ని వస్తువులకు పన్ను తగ్గించింది. తగ్గించిన ధరల మేరకు వినియోగదారులకు వస్తు సేవలు లభిస్తున్నాయా లేదా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి వినియోగదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు 1915 టోల్‌ఫ్రీ నంబర్‌, వాట్సాప్‌ 8800001915 నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యాపారులు తగ్గింపు ధరలను అమలు చేయకుంటే ఈ నెంబర్లలో ఫిర్యాదు చే యొచ్చు.ఈ కామర్స్‌ సంస్థలు సైతం తగ్గిన వ స్తు సేవల పన్ను విధానం మేరకు సరుకులు అందించకపోతే ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించింది.

బీవోఎస్‌ చైర్మన్‌గా ప్రొఫెసర్‌ రవీందర్‌రెడ్డి



అపర్ణకు నియామకపత్రం అందజేస్తున్న వీసీ



స్వప్న, రవీందర్‌రెడ్డిలకు నియామక పత్రాలు అందజేస్తున్న రిజిస్ట్రార్‌

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో పలు విభాగాలకు చైర్మన్‌, డీన్‌, సమన్వయకర్తలను నియమిస్తూ వీసీ ప్రొఫెసర్‌ యాదగిరిరావు ఆదేశాలు జారీ చేశారు. అర్థశాస్త్ర విభాగం బోర్డ్‌ ఆఫ్‌ చైర్మన్‌ (బీవోఎస్‌)గా ప్రొఫెసర్‌ రవీందర్‌రెడ్డి నియామకం అయ్యారు. అర్థశాస్త్ర విభాగంలో 17 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం ఉండటంతోపాటు ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌, పలు అకడమిక్‌, అడ్మినిస్ట్రేటివ్‌ పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. అర్థశాస్త్ర విభాగాధిపతిగా ఎన్‌.స్వప్న నియామకమయ్యారు. అర్థశాస్త్ర విభాగంలో స్వప్నకు 12 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ప్రస్తుతం ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌-1 ప్రోగ్రాం ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం సమన్వయకర్త (కోఆర్డినేటర్‌)గా ప్రొఫెసర్‌ కే అపర్ణ నియమితులయ్యారు. అపర్ణ వర్సిటీలో పలు అకడమిక్‌, అడ్మినిస్ట్రేటివ్‌ పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. రవీందర్‌ రెడ్డి, స్వప్న, అపర్ణలకు వీసీ యాదగిరి రావు, రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి నియామక ఉత్తర్వులను అందజేశారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సమాచార హక్కు వ్యవస్థను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు వ్యవస్థను బలోపేతం చేయాలనే సంకల్పంతో స.హ. చట్టం-2005ను ప్రవేశపెట్టాయని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి అన్నారు. తెయూ సమాచార హక్కు సహాయాధికారి డాక్టర్‌ నీలిమా అధ్యక్షతన 'సమాచార హక్కు చట్టం-2005' పై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు రిజిస్ట్రార్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే వ్యవస్థలు ప్రగతి పూర్వకంగా ముందుకు పోతాయన్నారు. పౌర సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని పారదర్శకంగా అందించాలన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే సమాచారాన్ని గోప్యంగా ఉంచాలన్నారు. వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌ కే ప్రసన్న రాణి మాట్లాడుతూ సమాచారం అడగడం పౌరుల ప్రధానహక్కుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్‌ ప్రవీణ్‌ మామిడాల, కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ సంపత్‌ కుమార్‌, యూజీసీ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆంజనేయులు, సమాచార కేంద్రం జూనియర్‌ అసిస్టెంట్‌ హరీశ్‌, టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం

- అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ
- అట్టహాసంగా ప్రారంభమైన ఎస్జీఎఫ్‌ అండర్‌-14 తైక్వాండో టోర్నీ



మాట్లాడుతున్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌

నిజామాబాద్‌ నాగారం: జిల్లా కేంద్రంలో సరైన మైదానాలు లేకపోయినప్పటికీ ప్రతిభచాటుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం క్రీడాకారుల గొప్పతనమని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ అన్నారు. ఎస్‌జీఎఫ్‌ అండర్‌-14 తైక్వాండో టోర్నీని ఎమ్మెల్యే ధన్‌పాల్‌ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహిస్తుంటే, రాష్ట్రంలో మాత్రం గత ప్రభుత్వం క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ఓ క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించినప్పటికీ ప్రభుత్వం కేటాయించకపోవడం దారుణమన్నారు. జిల్లాలో క్రీడా మైదానం ఏర్పాటు కోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్‌ కార్యదర్శి నాగమణి, డీవైఎస్‌వో పవన్‌ కుమార్‌, ఒలింపిక్‌ సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, పేట సంఘం అధ్యక్షులు విద్యాసాగర్‌ రెడ్డి, గోపి రెడ్డి, మల్లేశ్‌ గౌడ్‌, డీసీసీబీ సెక్రెటరీ సీతయ్య, తైక్వాండో అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షులు అజ్మత్‌, కార్యదర్శి వినోద్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఏడుగురి రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి

మద్నూర్‌(జుక్కల్‌): యువకుడి హత్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, బిచ్కుంద సీఐ రవికుమార్‌, ఎస్సై విజయ్‌కొండ వివరాలు వెల్లడించారు. సోముర్‌ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌, భీంరావ్‌, తేజరావ్‌, సూర్యకాంత్‌, పండిత్‌రావ్‌, రాచప్ప, హన్మంత్‌, రామ్‌నాథ్‌ వరుసకు అన్నదమ్ములు. గత నెల 28న భీంరావ్‌కు రాజ్‌కుమార్‌ డబ్బులు బాకీ ఉండగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. డబ్బులు తక్కువ చెల్లిస్తున్నావని భీంరావ్‌ రాజ్‌కుమార్‌ను ప్రశ్నించాడు. దీంతో రాజ్‌కుమార్‌ భీంరావ్‌ను దుర్భాషలాడాడు. భీంరావ్‌తోపాటు తేజరావ్‌, సూర్యకాంత్‌, పండిత్‌రావ్‌, రాచప్ప, రామ్‌నాథ్‌, హన్మంత్‌లు కలిసి రాజ్‌కుమార్‌పై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. రాజ్‌కుమార్‌ను స్థానికులు నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందాడు. మృతుడి తండ్రి బస్వంత్‌ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

క్రైం కార్నర్‌

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి



రాములు మృతదేహం

బాల్కొండ: ముప్కాల్‌ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన వడ్ల రాములు(48) గ్రామ ఊర చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఎస్సై రజనీకాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రాములు గ్రామంలో వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అప్పుడప్పుడు మానసిక పరిస్థితి బాగోలేక పోవడంతో ఆందోళనగా తిరిగేవాడు. ఈ క్రమంలో చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. శనివారం నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్‌

ఖలీల్‌వాడి: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మంచిర్యాలకు చెందిన పాత నేరస్తుడు షేక్‌ యూనుస్‌ మేడ్చల్‌ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు వచ్చిన సమాచారంతో శుక్రవారం అక్కడికి వెళ్లి అరెస్టు చేశామన్నారు. కృష్ణ, పండరీపూర్‌ రైలులో నిందితుడు చోరీకి పాల్పడ్డాడన్నారు. నిందితుడి నుంచి రెండు ఫోన్లు, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై రెండు కేసులు ఉన్నట్లు నిర్ధారించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. రైల్వే ఐడీ పార్టీ పోలీసులు హనుమాన్‌ గౌడ్‌, సురేందర్‌ గురుదాస్‌ ఉన్నారు.

దుబాయ్‌లో అపస్మారకస్థితిలో జిల్లా వాసి

- ఆస్పత్రిలో చేర్పించిన ఎయిర్‌పోర్టు సిబ్బంది

నిజామాబాద్‌అర్బన్‌: దుబాయి ఎయిర్‌పోర్ట్‌లో నిజామాబాద్‌ నగరానికి చెందిన సయ్యద్‌ బాబా (38) అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 3న సయ్యద్‌ బాబా ముంబై నుంచి సౌదీ అరేబియాలోని అభా నగరానికి వెళుతూ దుబాయ్‌ ఎయిర్‌పోర్టులో మరో విమానం ఎక్కాల్సి ఉండగా, అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్పందించిన ఎయిర్‌పోర్ట్‌ సిబ్బంది సయ్యద్‌ బాబాను రషీద్‌ హాస్పిటల్‌లో చేర్పించి మానవత్వం చాటారు. అస్వస్థతకు మత్తు కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కాగా, అతడిని ఇండియాకు తిరిగి రప్పించాలని భార్య సమీనా బేగం హైదరాబాద్‌ ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఎమిగ్రెంట్స్‌ వెల్ఫేర్‌ ఫోరం ప్రధాన కార్యదర్శి బీఎల్‌ సురేంద్రనాథ్‌ వారికి మార్గదర్శనం చేశారు. దుబాయిలో ఉన్న జిల్లావాసులు నయీం, కొట్టాల సత్యం, నారాగౌడ్‌ రోగి బాగోగులు చూసుకుంటున్నారని కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యార్థినుల అదృశ్యం కథ సుఖాంతం


- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం నుంచి బుధవారం అదృశ్యమైన ముగ్గురు విద్యార్థినులను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బుధవారం ఉదయం తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ఎవరికీ సమాచారం అందించకుండా హాస్టల్‌ నుంచి బయటకు వెళ్లారు. ఓ విద్యార్థినికి పరిచయం ఉన్న వ్యక్తితో వీరు నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లిపోయారు. ఓ విద్యార్థిని నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లోనే రైలు ఎక్కకుండా దిగిపోయింది. ఇద్దరు విద్యార్థినులు మాత్రం పరిచయం ఉన్న వ్యక్తితో వెళ్లారు. తల్లిదండ్రులు, తోటి విద్యార్థినుల వద్ద సమాచారాన్ని సేకరించిన పోలీసులు విద్యార్థినికి పరిచయం ఉన్న వ్యక్తి ఫోన్‌ను ట్రేస్‌ చేశారు. దీంతో వీరు హైదరాబాద్‌కు వెళుతున్నట్లు గుర్తించారు. కాచిగూడ రైల్వే పోలీసులకు సమాచారం అందించగా వారు ఇద్దరు విద్యార్థులతోపాటు మరో వ్యక్తిని పట్టుకున్నారు. రెండో టౌన్‌ పోలీసులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి వారిని తీసుకొచ్చారు. దీంతో అదృశ్యం ఘటన సుఖాంతమైంది. కాగా, విద్యార్థినులతో వెళ్లిన వ్యక్తిపై కేసు నమోదు కాలేదు. విద్యార్థినులే అతన్ని తీసుకొని హైదరాబాద్‌కు వెళ్లినట్లు విచారణలో తేలింది. అతనిపై ఫిర్యాదు ఇవ్వకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

విద్యుత్‌ వైరు చోరీ

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మాధవనగర్‌ డివిజన్‌ శివారులో గల ఓ వెంచర్‌లో 15 స్తంభాలకు వచ్చే విద్యుత్‌ తీగ గురువారం రాత్రి చోరీకి గురైనట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో తెలిపారు. వెంచర్‌ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీరు సీసాతో ఆర్టీసీ బస్సుపై దాడి



ఆలూర్‌లో రోడ్డుపై బైఠాయించిన ప్రయాణికులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం ఆలూర్‌ గ్రామంలో ఓ యువకుడు మద్యం మత్తులో ఆర్టీసీ బస్సుపై బీరు సీసాతో దాడి చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి ఆర్మూర్‌ డిపోకు చెందిన బస్సు ఆలూర్‌ మీదుగా నందిపేట్‌ వెళ్తుండగా ఆలూర్‌ గ్రామంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద జాన్‌(ప్రవీణ్‌) అనే యువకుడు బైక్‌ను ఇష్టానుసారంగా నడుపుతుండడంతో డ్రైవర్‌ శ్రీరాములు హారన్‌ కొట్టాడు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేస్తూ జాన్‌ బీరు సీసాతో బస్సుపై దాడి చేశాడు. అనంతరం బస్సులోకి ప్రవేశించి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. బీరు సీసాతో బస్సు డ్రైవర్‌ను చంపాలని ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అదే సమయంలో వార్త సేకరణకు వెళ్లిన ఓ రిపోర్టర్‌ను సైతం జాన్‌ బెదిరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగానే జాన్‌ అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో ప్రయాణికులు రోడ్డుపై బైఠాయించి జాన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. బస్సు డ్రైవర్‌, రిపోర్టర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దేవునిపల్లిలో భారీ చోరీ

- రూ.2.5 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణ



విచారణ జరుపుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: తాళం వేసి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చేలోపే దుండగులు ఇళ్లు గుల్ల చేశారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దేవునిపల్లిలోని భూమెుళ్ల శ్రీశైలం బీడీ కంపెనీ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గాంధీనగర్‌ కాలనీలో బంధువుల పెళ్లి ఉండటంతో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కుటుంబంతో కలిసి వెళ్లారు. శ్రీశైలం తిరిగి శుక్రవారం వేకువజామున 5 గంటలకే వచ్చాడు. అప్పటికే తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో సామాన్లు, బీరువా చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఇంట్లో దాచిన రూ.2.5 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణకు గురైనట్లు బాధితుడు శ్రీశైలం వాపోయాడు. కాగా, పక్కనే ఉన్న మరో ఇంట్లో సైతం దొంగలు చొరబడి చోరీకి యత్నించారు. ఆ ఇంట్లో విలువైన వస్తువులు లేకపోవడంతో వెళ్లిపోయారు.

తాళం వేసిన ఇంట్లో ..



దుండగులు తెరిచిన బీరువా

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన బేగరి జ్యోతి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో నైట్‌ డ్యూటీ చేసి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడటంతో బీరువా తెరిచి ఉంది. అందులోని ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 48 వేల నగదును దుండగులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.